క్లుప్తంగా

మహిళలకు బహుమతులు

మోతీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. వివేకానందనగర్ కమిటీహాల్‌లో బుధవారం విజేతలకు కార్పొరేటర్ సబిహా బేగం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌యాదవ్, పుష్ప, యోగిరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌మీడియాలో ప్రతి ఒక్కరూ యాక్టివ్

రాయదుర్గం: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారని అనురాగ్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సైదా సమీన్‌ఫాతిమా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'లింగ సమానత్వం అండ్ డిజిటల్ స్పేస్‌లలో మహిళల రక్షణ' అనే అంశంపై ప్రత్యేక సింపోజియంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ సిస్టమ్‌లో లోపాలు ఉన్నాయని, ఫలితంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. అన్ని రంగాలలో మహిళలకు న్యాయం సమాన వేతనాలు, సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని భాష్యం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ పదో వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ప్రణయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అనుభవం కల్గిన ఉపాధ్యాయులతో బోధన తరగతులు నిర్వహిస్తున్న భాష్యం స్కూల్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, స్కూల్స్ జోనల్ ప్రిన్సిపల్ శిరీష, ప్రిన్సిపల్ ప్రియాంక, సాంబశివరెడ్డి, మురళీధర్‌యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓయూలో కాన్షీరాం జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం 89వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కాన్షీరాం చిత్రపటానికి పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొ.చంద్రునాయక్ నివాళి అర్పించి బహుజన రాజ్యాధికారం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంజయ్, తిరుపతి, రాముయాదవ్, వెంకన్నగౌడ్, కిషన్‌నాయక్, అంజి, సత్యం, ఆనంద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీలో జరిగిన ఘటనపై ఓయూలో నిరుద్యోగులు, విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. బుధవారం నవ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ (ఎన్‌టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీ చేపట్టి రోడ్డుపై ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, జాతీయ నాయకులు నాగేశ్వర్‌రావు మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించి, సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కేంద్రీయ ఉపకార వేతనాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

గచ్చిబౌలి: కేంద్రీయ ఉపకార వేతనాల(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు కొండాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2022 డిసెంబర్ 18న ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ ప్రవేశ పరీక్షలో కొండాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు దిండి బిందు, వాసంశెట్టి జాహ్నవి దుర్గ, గుమ్మడవెల్లి శివ, ఎల్.కె.నవ్య శ్రీ, నాగేటి నతానేల్ జేదిద్య, ముంగ్యా అఖిల ప్రతిభ కనబరిచి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఆరు నెలల పాటు పక్కా ప్రణాళిక ప్రకారం శ్రమించి ప్రవేశ పరీక్ష రాశారని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

జీడిమెట్ల: రోజురోజుకి ఎండలు పెరుగుతున్నాయని.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు గొల్లజాన్ కోరారు. బుధవారం ఆయన గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డీసీ సర్వే నిర్వహించి అవసరం ఉన్న ప్రాంతంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

తాగునీరు రోడ్డుపాలు

ఫైప్‌లైన్లకు తరచూ లీకేజీలు


కమలప్రసన్ననగర్‌లో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి రోడ్లపై పారుతున్న తాగునీరు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- సరఫరా అవుతున్న కలుషిత జలాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

ఆల్విన్‌కాలనీ: అసలే వైరస్‌లు వ్యాప్తి చెంది అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. అది ఏ రోగమో కూడా తెలియక సతమతమవుతున్న కాలంలో కలుషిత జలాల సరఫరాతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్‌లోని ప్రతి కాలనీలో తాగునీటి పైపులైన్లు లీకై తాగునీరు రోడ్డు పాలవుతోంది. ఈ నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గోదావరి జలాలు నగరవాసులకు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటి వృథాతో పాటు కలుషిత జలాల సరఫరా అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కాలనీలో పర్యటించి లీకేజీల మరమ్మతులతో పాటు పకడ్బంది చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- వివేకానందనగర్ డివిజన్ కమలప్రసన్ననగర్ కాలనీ ప్రధాన రహదారి పైపులైన్ రోడ్డులో ఉన్న మెయిన్ వాటర్ పైపులైన్ కొన్ని నెలలుగా లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. ఇదే పైపు లైన్ ద్వారా కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని అన్ని కాలనీలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రధాన రహదారి కావటంతో రహదారిపై ప్రవహించే నీటిలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ నీరు ఇతరులపై పడటంతో చిన్నపాటి గొడవలు కూడా జరుగుతున్నాయి.
- ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జిపై ఉన్న ప్రధాన పైపులైన్ లీకేజీ కారణంగా బ్రిడ్జిపై ఉన్న మురుగు, చెత్తాచెదారం పైపులైన్‌పై చేరి ఈగలు, దోమలకు ఆవాసంగా మారి మంచినీటి పైపులైన్ల ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. కొన్ని నెలలుగా ఈ పైపులైన్ లీకేజీ అవుతున్నా స్థానికంగా మురుగు ప్రవహిస్తున్నా అక్కడే చెత్తాచెదారం పడేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.


ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డుపై...


రిక్షాపుల్లర్స్ కాలనీలో..

- పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలని అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు తెలుపుతున్నారు. నిత్యం ఇదే రహదారిపై ప్రయాణించే వారు ఈ కలుషిత నీరే మనం తాగుతున్నామా అని బెంబేలెత్తుతున్నారు.
- రిక్షాపుల్లర్స్ కాలనీలో నల్లాలు విప్పిన ప్రతిరోజు తాగునీరు వృథాగా వదిలేస్తున్నారు. ఎక్కువగా నిరుపేదలే ఈ కాలనీలో నివసిస్తుంటారు. కనీస అవగాహన లేక నీరు సరిపోయిన తరువాత నల్లాలు కట్టేయాల్సింది పోయి నీటిని రోడ్లపైనే వృథాగా వదిలివేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ కాలనీలో పర్యటించి నీటి విలువపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పైపులైన్లు లీకేజీలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి

ఆల్విన్‌కాలనీ ప్రధాన రహదారిలో పైపులైన్లు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు ఏదో ఒక ప్రాంతలో లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఈ నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి. ప్రజలకు స్వచ్ఛమైన శుచి, శుభ్రతతో కూడిన తాగునీరు సరఫరా చేయాలి.
– నరేందర్‌రెడ్డి, ఆల్విన్‌కాలనీ



మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ


జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో ట్రక్కు పార్కు వద్ద ఏప్రిల్ 2న జరగబోయే మెగా జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో జరగబోయే ఈ జాబ్ మేళాలో దాదాపు 108 కంపెనీలు పాల్గొంటాయన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడో తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్, టెక్నికల్, నాన్ టెక్నికల్ అర్హతను బట్టి అందరికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. కరపత్రంలోని క్యూఆర్ కోడ్‌నే ఉపయోగించుకొని లాగిన్ అవ్వొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, యూత్ అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేతల ఐక్యతతోనే బహుజన రాజ్యం

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజనులకు రాజ్యాధికార ఆకాంక్ష ప్రతి కుటుంబంలో రావాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం ఓయూలో బీఎస్‌ఎఫ్ అధ్యక్షులు బొరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్షీరాం జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం కొందరితో సాధ్యం కాదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలను పూలే, అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచన విధానంతో చైతన్య పర్చాలన్నారు. రాజ్యాధికారానికి రానివ్వకుండా కొన్ని శక్తులు బహుజనుల గొంతు నొక్కేందుకు వ్యవహరిస్తున్నాయన్నారు. బహుజన రాజ్యం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, డీఎస్పీ అధినేత విశారదన్ మహారాజ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఇతర సంఘాల నేతలు ఏకం కావాలన్నారు. ఏప్రిల్ 3, 4 తేదీల్లో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ, 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా బ్లూ మార్చ్, మే చివరి వారంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకట్, చంద్రునాయక్, శ్రీకృష్ణ, ఎల్లన్న, బొట్టు శ్రీను పాల్గొని ప్రసంగించారు.

సైన్స్ మొదటి మహాసభ విజయవంతం

ఉస్మానియా యూనివర్సిటీ: బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో నిర్వహించిన సైన్స్ మొదటి మహాసభ విజయవంతమైందని స్టేట్ చాప్టర్ ప్రతినిధి ఎ.ప్రతిభ తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలోని 57వ తరగతి గదిలో జరిగిన మహాసభకు వివిధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ తెలంగాణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు డా.గంగాధర్, ఉపాధ్యక్షులు దేవర్షి గంగాజీ, డా.వికాస్ శర్మ, డా.నతనియల్, కార్యదర్శిగా శరత్, కోశాధికారిగా ఉషాకిరణ్, ఆఫీస్ సెక్రటరీగా సాయికుమార్ ఎంపికయ్యారు.

'కళాసిల్క్ హస్తకళ'కు విశేష స్పందన


చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న చేనేత హస్తకళ ప్రదర్శన కళాసిల్క్‌కు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు సంజయ్ జైన్, వినోద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ మేళాలో ఆంధ్రప్రదేశ్, వెంకటగిరి, మంగళగిరి, కళంకారి ఉప్పాడ మొదలైన చీరలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు, డోర్ కర్టెన్లు, హర్యానా బెడ్‌కవర్లు, కుర్తి డ్రెస్ మెటీరియల్స్, జైపూర్ స్టోన్ జ్యువలరీ క్రాఫ్ట్స్ వంటి ఇతర వస్తువులు సైతం ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని మోతీనగర్ పరిసర ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రచయిత్రి అనురాధకు సత్కారం

మోతీనగర్: చంద్రాగార్డెన్ సమీపంలో నివాసముండే ప్రముఖ రచయిత్రి అనురాధ సాహిత్యంలో చేస్తున్న కృషిని గుర్తించి ఈ నెల 14న బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఆమెను సత్కరించారు. పవిత్ర పుణ్య స్థలమైన కాశీలో ఇలా సత్కారం పొందటం మరపురాని అనుభూతిని మిగిల్చిందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బెనారస్ హిందూ యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య భూదాటి వెంకటేశ్వర్లు, సహాయ ఆచార్యులు డా.గట్ల ప్రవీణ్, డా. టి.జగదీశన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రముఖ రచయిత్రి అనురాధను సత్కరిస్తున్న ఆచార్యులు

అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ బోర్డు ఏర్పాటు


నిర్మాణం ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న కాలనీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సర్వేనం.336/పీలో అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం మేడ్చల్–మల్కాజ్‌గిరి కలెక్టర్ ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం సదరు స్థలంలో కమ్యూనిటీహాల్ బోర్డు ఏర్పాటు చేశారు. దీనికి సహకరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, కలెక్టర్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే గాంధీ రూ.10లక్షలను మంజూరు చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మగల్ల మోజెస్, నిరుడు రాజు, బాలస్వామి, రాము, విజయ, రవి, కటిక రవి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు త్వరలో పూర్తి చేస్తాం


బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి శ్మశానవాటికల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ముస్లిం శ్మశానవాటికలో కమిటీ ఆధ్వర్యంలో వేస్తున్న బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్లమ్మబండలో ముస్లిం, హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటిక పనులను కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముస్లిం శ్మశానవాటిక పనులను కోటి రూపాయల నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలో నిధులు మంజూరు చేయించి శ్మశానవాటికలో మిగిలిన పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. శ్మశానవాటికకు ప్రహరీతో పాటు ఉద్యానవనంలా శ్మశానవాటికలో మొక్కలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్మశానవాటిక కమిటీ సలహాదారుడు ఎండీ ఇస్మాయిల్, షబ్బీర్, ఖాజా, ఎంఏ కరీం, అధ్యక్షుడు ఎంఏ సమ్మద్, ప్రధాన కార్యదర్శి షౌకత్ అలీ మున్నా తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో దూరవిద్యలో డ్రాప్‌ఔట్లకు మళ్లీ అవకాశం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా విభాగంలో డ్రాప్‌ఔట్లకు మళ్లీ ప్రవేశం కల్పించాలని నిర్ణయించినట్లు 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. డీడీఈ ఆధ్వర్యంలో రీఅడ్మిషన్‌లను 2005 ఆతర్వాత బ్యాచ్‌లు, అంతేకాకుండా యూజీ , 2014 నుంచి వార్షిక మోడ్‌లో పీజీ ఫాలో–ఆన్–కోర్సులలో నమోదు కోసం ఫీజు చెల్లింపు పోర్టల్‌ను తెరిచిందన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న శివమ్మ కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ శివమ్మకాలనీలో ఓమ్ని ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి డాక్టర్ సతీష్ కుమార్ మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలన్నారు. పోషక విలువలున్న ఆహారం తీసుకొని, ప్రతి రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. సీఓఓ మంజునాథ్ పర్యవేక్షణ, కాలనీ అధ్యక్షుడు మోతే నరసింహులు సహకారంతో జరిగిన శిబిరంలో కోఆర్డినేటర్ సురేంద్ర, ఆస్పత్రి సిబ్బంది, ఈశ్వర్, పుట్ట మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాలను కాపాడాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ బుధవారం బాచుపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... సర్వే నం.87, 90, 94, 95, 182, 191, 233, 322లలో ఎన్ని ఫిర్యాదులు చేసినా విచారణ చేయడం లేదన్నారు. అదే విధంగా ప్రైవేటు స్థలాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను సర్వేయర్ శ్రీనాథ్ ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా సర్వే చేసి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడానికి ముఖ్య కారణమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిపై పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రంలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, శివకుమార్‌రెడ్డి, కీర్తిబాబు, డిల్లీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సీపీఐ నేతలు

పనికి కూలీలను పంపుతానని మోసం

ఆన్‌లైన్‌లో రూ.21,500 కాజేసిన గుర్తు తెలియని వ్యక్తి

అమీర్‌పేట: కంపెనీలో పనిచేసేందుకు కూలీలను పంపుతానని ఓ వ్యక్తి రూ. 21,500 దండుకున్న ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్ జెక్‌కాలనీలో ఉండే సయాన శ్రీనివాస్‌రావుకు పాశ మైలారంలో గాయత్రీ ప్యాకేజీ కంపెనీ ఉంది. అతడికి ఈ నెల 11న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. లేబర్ కాంట్రాక్టర్‌గా పరిచయం చేసుకుని ఒరిస్సాలో ఏడుమంది లేబర్లు ఉన్నారని కావాలంటే పంపుతానన్నాడు. అయితే అడ్వాన్స్ కింద రూ.18 వేలు చెల్లించాలని చెప్పడంతో శ్రీనివాస్‌రావు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించాడు. వచ్చేటప్పుడు రైలులో ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారని తమ వద్ద ఆధార్ కార్డులు కూడా లేవని రైలు శబ్దాన్ని వినిపించడంతో పాటు ఆర్‌పీఎఫ్ పోలీసులు మాట్లాడినట్టు ఫోన్‌లో మాట్లాడించి మళ్లీ రూ.3.500 వేయించుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మహిళ మృతికి వైద్యులు కారణమంటూ ధర్నా

అమీర్‌పేట: వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ రహమత్‌నగర్ సంతోష్‌గిరికి చెందిన రాణి (22) ప్రసవం కోసం ఈ నెల 13న మోతీనగర్‌లోని సన్‌రిడ్జ్ ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు రాగారెడ్డి సూచనల మేరకు చేర్చుకుని సిజరిన్ చేయాలని తెలిపి మరుసటి రోజు సిజరిన్ చేయగా రాణి కవలలకు (ఆడపిల్లలు) జన్మనిచ్చింది. రక్తస్రావం ఆగకపోవడంతో రాణి ఆరోగ్య పరిస్థితి విషమించింది. రోగికి వెంటనే డయాలసిస్ చేయాలని చెప్పి రాత్రి 11 గంటలకు కాచిగూడలోని టీఎక్స్ ఆస్పత్రికి పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు రోగికి డయాలసిస్ అవసరం లేదని, సిజరిన్ సరిగా చేయని కారణంగా అధిక రక్తస్రావం అవుతుండడంతో ఆరోగ్యం క్షీణిస్తుందని మెరుగైన వైద్యం కోసం ఉప్పల్‌లోని టీఎక్స్ బ్రాంచికి తీసుకుళ్లాలని సూచించారు. బుధవారం తెల్లవారుజామున ఉప్పల్ ఆసుపత్రికి తరలించే క్రమంలో రాణి మృతి చెందింది.

ఆస్పత్రి ఎదుట ఆందోళన..

వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని రాణి భర్త దీపక్ కుటుంబ సభ్యులతో కలిసి మృతదేహంతో ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు. పుట్టిన ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

విడాకులివ్వకుండా మరో పెళ్లి చేసుకున్న వ్యక్తికి జైలు

మియాపూర్: మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా మరో పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తికి కూకట్‌పల్లి కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పంజాగుట్టకు చెందిన జి.ప్రవీణ్‌కుమార్, మియాపూర్‌కు చెందిన సంతోష్ వాణిని మొదట పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత వాణికి తెలియకుండా.. విడాకులు ఇవ్వకుండా కొత్తగూడకు చెందిన భవానీ అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సంతోష్ వాణి 2016లో ప్రవీణ్‌కుమార్‌పై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. పోలీసులు చార్జీషీటు కోర్టులో సమర్పించారు. వాదోపవాదాలు విన్న తర్వాత కూకట్‌పల్లి 8వ అదనపు మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానాను విధించినట్లు తెలిపారు.